కవితా కౌముది

# ఋతుభ్రమణంలో

మరువం ఉష



లెక్కకి పాతిక వారాలు మా పూలసాగుకి-
ఈ యేటి మధుమాసపు వెచ్చనల్లో
మరోమారు ఉత్సాహపు పల్లవింపు
పడమర నేలలోనూ, నాలోనూ.

ఓ గ్రీష్మ సంధ్యాసమయాన పచ్చని మడుల్లో
లెక్క పెంచుతూ ఈ రెండు మొక్కలు.
కలుపుగా పెకిలించలేని నా తనం
వల్లమాలిన ప్రేమ ఉబికే ప్రతి వనమాలి వైనమే!

ఉదయారుణ కాంతిలో వాటినే చూసుకుంటాను
ఒకవైపు పసుపు పచ్చని పూలు
ఆ వంక చివురు మెత్తని మ్రోల
కలివిడిగా తిరుగుతూ గాలులు, నా మురిపాల వలెనే..

శరదృతువు రానున్న దండోరాతో
పెంచుకున్న పూరెక్కలు, వన్నె మారిన పండుటాకులు
కోలాటాలు కట్టి వీడు వదిలే వేళ
కలవరపాటుని కప్పిపుచ్చలేని నా కనులు, నేలలోని
వేరులూ...

అయితేనేమి, శిశిరపు ఘడియని పక్కకి నెడుతూ
ముదురాకు కొమ్మలతో ఆ మొక్క,
మొగ్గ వెనుక మొగ్గగా పుష్పిస్తూ ఈ పూల తీగె
ఎవరివైతేనేమి ఎగురుతున్న ప్రకృతి బావుటాలు?

పదిలమైన గురుతుల దిగుబడి మోస్తూ
పదును తగ్గని పచ్చదనాలు మోస్తూ-
నేనూ, నేలనంటిపెట్టుకున్న నా వలస మొక్కలు
పొగమంచు, లేతెండల పోరు చూస్తూనే ఉన్నామింకా...!

★★★



# స్వప్న సమీరం

## శిష్ట్లా. వి.యల్.యస్.శర్మ

నేను కలలతో నిద్రిస్తున్నాను
కల్పనలో నిద్రిస్తున్నాను
కాలంలో నిద్రిస్తున్నాను
చేతనలో నిద్రిస్తున్నాను
అంతటా నిద్రావస్థే.....
నిజంకాని కలల్ని....కల్పననీ
ఆహ్వానిస్తూ
కాల వర్తనలో నిద్రను భద్రంగా అనుభవిస్తున్నాను..!
స్వప్న పరిష్వంగంలో
నేను ఊహల రంగులు మార్చుకుంటున్నాను
మరోలోకాన్ని సృష్టించుకుంటూ!
అంతా స్వప్న సమీరమే!

కల పారిపోయాక
కళ్ళు తెరచి చూస్తే
నిజాల దారులు దానికి
భిన్నంగా....దూరంగా!
కాలం పిడికిలిలో
నా కల...కల్పన
నిద్రలోనే మాయమయ్యాయి..
నిద్రలేచాక నాకు కనబడుతున్నాయి
కాలము....చేతన!
నా నిద్రను నిరంతరం భగ్నం చేస్తూ.....!

కాలంలో.......చేతనలో.....
నిద్రిస్తున్న నన్ను మేల్కొల్పుతూ...
వర్తమానాన్ని నడుపుతూ!
నేనెవరో తెలుపుతూ!

★★★

# రాత్రి నా నేస్తం

## కవితా రమణి

ఈ చీకటి నాకెంతో నచ్చింది
అంధకారమైనా అందంగా ఉంది!
కానీ ఉషోదయపు రేఖలు దీన్ని
చిన్నభిన్నం చేసేస్తాయి కదా!

ఈ నిశ్శబ్దం నాకెంతో యిష్టం!
మనోరవం తప్ప మరేదీ వినిపించదు!
కానీ ప్రభాత కూజనాలు దీన్ని
విచ్ఛేదిచ్చేస్తాయి కదా!

ఈ ఏకాంతం శాంతాక్రాంతం,
స్వగతాల సావల సాంత్వనం!
తెల్లవారితే ఔతుంది కదా
సాంద్ర జనఘోష సంహ్వాతం!

ఈ కాలం పగలు పారిపోయినా
రాత్రుళ్ళు దరి చేరుతుంది!
తెల్లారేదాకా నాతోనే ఉంటుంది!
అందుకే పగలంతా జాగారం చేస్తాను
మళ్ళీ వచ్చే రాత్రి కోసం!
నన్ను కమ్ముకునే మైత్రి కోసం!

★★★



# గూడు - గువ్వపిల్ల
## గరిగె రాజేశ్

క్యాలెండర్ కొమ్మమీద
తేదీ తెల్ల పావురమై వాలి
క్షణపు కంకి గింజల్ని బుక్కుతుంటుంది

జీవితపు తీరంపై నడిచెళ్ళే ఒక జ్ఞాపకం
ఎప్పుడూ పసిపాప నవ్వులా పలకరిస్తూ ఉంటుంది

జీవిత పయనంలో కలిసే ప్రతి వ్యక్తి
ఏవో కొన్ని అనుభవాలను గుండె మీద చల్లి వెళ్లిపోతుంటాడు

ఎదురయ్యే ప్రతి నిమిషం
ఏదో ఒక జ్ఞాపకపు అక్షరాన్ని
గత పుస్తకంపై రాస్తుంది

అవును

దేహం ఒక గూడు
ప్రాణం ఆ గూడులోంచి ఎప్పుడు ఎగిరిపోతుంది తెలియని గువ్వపిల్ల

★★★★



# ఒప్పంద పత్రం
## రఘు ఆళ్ల

నింగికీ నేలకి
నీటికీ ఎండకి
నవ్వుకీ బాధకి
కంటికీ కలకి
జ్ఞాపకానికీ మరపుకి
నీకూ నాకు –

ఇలా చాలా బంధాలుంటాయి
ఎప్పటి ఒప్పంద పత్రమో అది
ఒకరికొకరు రాసుకున్నట్లు..
ఒకరికొకరు చెప్పుకున్నట్లు..

చూడొకసారి,
ఆ పత్రానికి సాక్షులుగా నిల్చిన
రెక్కలొచ్చిన క్షణాలను!
మౌనంలో వాలిన జ్ఞాపకాలు
కొన్ని మాటలుగా మారితే ఎలా ఉంటుందంటావా..?

చెప్తా విను,
ఎండిన ఆకు కింద
పచ్చటి పూతొచ్చినట్లు!
తిరిగొచ్చిన వేకువకు రేయి మాయమైనట్లు!
వృత్తంలో ఆద్యంతాలు కలిసేది ఒక చోటే!
మౌనం వీడాల్సిన జ్ఞాపకమొకటి ఇప్పుడు మెరవాలే!!!

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి





ఏది సన్మార్గమో మరి యేది కాదో!
ఎవ్వరీ మార్గముల నిర్ణయించినారో!
మనుజులెల్లరు హర్షించు మార్గములను
అడుగునిడెదము విధినిర్వహణము వోలె

సర్వజనసమ్మతమె నాకు సమ్మతమ్ము
పదుగురు నడచునది నాకు పైడి బాట
పుడమిపై యూపిరందిన ప్రొద్దునుండి
తెలియజెప్పిరి సరియైన తీరిదంచు

మంచిదియు చెడ్డదియు కాని మార్గమొకటి
నడుమనున్నచో దాని నిర్ణయమదెట్లు?
ప్రేమికుల మార్గమట్టిదే విశ్వమందు
కాని యడ్డంకులెన్నియో కలుగు చుండు

ఉర్విలోనున్న జనులెల్లనొప్పుకొనని
మార్గమేమి కాదిసుమంత మాత్రమైన
ఔననుచునొకరు మరి కాదనుచునొకరు
అనినచోనవి కావు శిలాక్షరములు

ఎన్ని గమనముల్ పయనమ్ములెన్ని దార్లు
కలవు మన కొరకే మన కనుల ముందు
ఎవరినే విధమ్ముగను బాధింపకున్న
ఆత్మ చెప్పినదే మనకనుగైన బాట



చిత్రం:కె.రామ్మోహన్